
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



20,644 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 20,644 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 10,050, ఉత్తరకాలువకు 250, కావలి కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,17,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.10,611
3 శాతం జీఎస్టీతో	రూ.10,929
నవర (8 గ్రా)	రూ.87,432

గరిష్టం/కనిష్టం
32.6 /27.8

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మంగళవారం గాలిలో తేమ 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

25న కొత్త ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 25న అమరావతిలో సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేయనున్నట్లు డీఈఓ బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు అభ్యర్థులు వారి సహచరులతో ఈ నెల 24న వెంకటాచలం మండలం గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటల్లోపు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు వారి సహచరులకు అవసరమైన దుప్పట్లు, గొడుగులు, వాటర్ బాటిళ్లు వారే తెచ్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు గొలగమూడి ఆశ్రమం వద్ద అందజేయనున్నట్లు తెలిపారు. ఐడీ కార్డులు ఉంటేనే ఉపాధ్యాయులు, వారి సహచరులను ముఖ్యమంత్రి కార్యాక్రమానికి అనుమతిస్తారన్నారు.

వీఎస్‌యూ వీసీకి విశిష్ట గౌరవం



వీసీ అల్లం శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావుకు మరో విశిష్ట గౌరవం లభించింది. ప్రపంచంలో అగ్ర శాస్త్రవేత్తల జాబితాలో రెండో విభాగం శాస్త్రవేత్తలు ఉన్న జాబితాలో ఆయనకు స్థానం లభించింది. అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు రూపొందించిన ఈ జాబితాలో చోటు లభించడం విశేషం. భౌతికశాస్త్రం, పొటానిక్స్ విభాగాల్లో అల్లం శ్రీనివాసరావు చేసిన పరిశోధనలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. ఇప్పటి వరకు ఆయన 270కు పైగా పరిశోధనా పత్రాలు, పుస్తక అధ్యాయాలు ప్రచురించగా, 25 మంది పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకం వహించారు. ఈ విశిష్ట గౌరవం పొందిన వీసీ అల్లం శ్రీనివాసరావును మంగళవారం వీఎస్‌యూలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

అధికారం అండ
బియ్యం డాన్ దందా

నెలకు రూ.కోట్లలో రేషన్ బియ్యం అక్రమ రవాణా

- నెల్లూరు, ప్రకాశం, కడప, గుంటూరు, తిరుపతి జిల్లాల నుంచి బియ్యం సేకరణ
- పోలీస్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు
- ఇందు కోసమే 16 టర్బో లారీల కొనుగోలు
- రెండు రోజుల క్రితం 90 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత
- అవి మామూలు బియ్యంగా నిర్ధారించాలని డాన్ ఒత్తిడి
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ఎంట్రీతో రేషన్ బియ్యంగానే నిర్ధారణ



జిల్లా కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై 'సాక్షి' కథనాలు అక్షర సత్యాలని మరోసారి రుజువైంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన మహేష్‌రెడ్డి ఈ రేషన్ బియ్యం మాఫియాకు డాన్ అనేది స్పష్టమైంది. నెల్లూరుతోపాటు ప్రకాశం, వైఎస్సార్ కడప, గుంటూరు, తిరుపతి జిల్లాల నుంచి బియ్యం సేకరించి రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ.. పోలీస్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు ఇవ్వడంతో ఎవరికి వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నెల్లూరులో రెండు లారీల్లో పట్టుబడిన బియ్యం వ్యవహారంలో నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి ఎంట్రీతో సీన్ రివర్స్ అయింది. అవి మామూలు బియ్యంగా నిర్ధారించాలని డాన్‌తోపాటు మంత్రి అనుచరులు ఒత్తిడి చేసినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే దూకుడుతో అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లాలో రాజకీయాలు మంత్రి ఆనం వర్సెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డిగా మారాయి.

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో అవినీతి, అక్రమాల మాఫియాలు రాజ్యమేలుతున్నాయి. అధికార పార్టీ నేతల అండతో సహజ వనరుల దోపిడీ నుంచి పేదలు తినే బియ్యం వరకు దోచుకుతింటున్నారు. ప్రధానంగా జిల్లాలో రేషన్ మాఫియా బరితెగించింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అనుచరుడిగా చెలామణి అవుతున్న అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బుర్రెడ్డి మహేష్‌రెడ్డి ఈ రేషన్ మాఫియా డాన్‌గా వ్యవహరిస్తున్నాడని తాజాగా పట్టుబడిన బియ్యం లారీలతో బట్టబయలైంది. ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తూ అతని వాహనాలు పట్టుబడ్డాయి. తాజాగా నెల్లూరులో ఐదు వాహనాల్లో రేషన్ బియ్యంతోపాటు ధాన్యం, చిరుధాన్యాలు తరలిస్తూ అధికారులకు పట్టుబడడంతో అధికారులు కక్కుర్తి, ఎమ్మెల్యేల ధన దాహం బయట పడింది.

నాలుగు జిల్లాల్లో దందా

రేషన్ మాఫియా డాన్ మహేష్‌రెడ్డి నెల్లూరులోనే మకాం పెట్టాడు. మంత్రి ఆనంతోపాటు మరో మంత్రి నారాయణ అనుచరుడు సివిల్ సప్లయీస్ శాఖ డైరెక్టర్ సహకారంతో ఈ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెంగంపల్లిలో రేషన్ బియ్యం సేకరణ కోసం ప్రత్యేకంగా గోదాము నిర్మించి ఆత్మకూరు, బద్వేలు, ఉదయగిరి నియోజకవర్గాల నుంచి పేదల బియ్యాన్ని సేకరించి అక్కడి నుంచే దందా చేస్తున్నారు. ప్రకాశం, వైఎస్సార్ కడప, గుంటూరు, తిరుపతి జిల్లాల నుంచి రేషన్ బియ్యం సేకరణ చేస్తున్నారు. ప్రతి నెలా సుమారు 9 వేల టన్నుల బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. ఆయా నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలకు నెలకు రూ.లక్షల్లో ముడుపులు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందు కోసమే 16 వాహనాల ద్వారా బియ్యం సేకరించి అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి నెలలో 15 రోజుల పాటు బియ్యం దందా నడుస్తోంది. నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెంలోని రైస్ మిల్లులు లీజుకు తీసుకుని సేకరించిన బియ్యాన్ని అక్కడే నిల్వ చేసి పాలిష్ పెట్టి బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి చెన్నైతోపాటు కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు పంపుతున్నారు.

ముడుపుల మత్తులో అధికారులు

అక్రమ రవాణాకు సహకరించేందుకు పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులకు నెల నెలా రూ.లక్షల్లో ముడుపులు ఇస్తూ అతని వ్యాపారం సజావుగా సాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. వాహనం వెళ్లే ప్రతి మండల పరిధిలో పోలీస్‌స్టేషన్‌కు మామూళ్లు వెళ్తాయి.

నెల్లూరు రూరల్‌లో రేషన్ దందా

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో గోదాములు, రైస్‌మిల్లులు అద్దెకు తీసుకుని రేషన్ దందా నిర్వహిస్తున్నాడని తెలుస్తోంది. తాజాగా నెల్లూరు సిటీలో మంత్రి నారాయణకు కీలక అనుచరుడితో సన్నిహిత సంబంధాలు పెట్టుకుని అతని సహకారంతో బియ్యం సేకరణ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అతని వాహనాలకు ప్రత్యేక ఎస్కార్ట్, నలుగురు బౌన్సర్లు కూడా ఎస్కార్ట్ వాహనంలో ఉంచుకుని దందా చేసుకుంటున్నారని సమాచారం.

ఆనం వర్సెస్ కోటంరెడ్డి

జిల్లాలో మంత్రి ఆనం వర్సెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తీరుగా రాజకీయాలు మారాయి. మంత్రి పదవి కోసమే కోటంరెడ్డి టీడీపీలో చేరారు. అయితే ఆ పదవిని ఆనం తన్నుకుపోవడంతో అప్పటి నుంచి గుర్రుగా ఉన్నారు. త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనున్నాయనే ప్రచారం నేపథ్యంలో కోటంరెడ్డి దూకుడు పెంచారు. ఆనం అనుచరుడైన మహేష్‌రెడ్డి నెల్లూరు రూరల్ ప్రాంతం అడ్డాగా రేషన్ బియ్యం దందా నిర్వహిస్తుండడంతో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. తాజాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని ఆదివారం పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందడంతో సుభాన్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఐదు లారీలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇందులో రెండు లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. సుమారు 90 టన్నుల పేదల బియ్యం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.41.40 లక్షలు ఉంటుంది. అయితే రేషన్ బియ్యం కాదని రిపోర్టు ఇవ్వాలని సివిల్ సప్లయీస్ శాఖాధికారులపై సదరు డాన్‌తో పాటు ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయి. ఇదే సమయంలో కోటంరెడ్డి రంగంలోకి దిగారు. అవి పీడీఎస్ బియ్యమా? కాదా? అనే విషయంలో తప్పుడు రిపోర్టు ఇస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సివిల్ సప్లయీస్ శాఖాధికారులను హెచ్చరించారు. ఆ లారీల్లో పట్టుబడిన బియ్యం శాంపిల్స్‌ను నెల్లూరు, తిరుపతి, ఒంగోలులోని ల్యాబ్‌ల్లో టెస్టింగ్ కోసం పంపించానంటూ అధికారులకు స్పష్టం చేశారు. ఇరువైపుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంతోపాటు మీడియాలో వస్తున్న కథనాలతో సివిల్ సప్లయీస్ శాఖాధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకుంటూ అవి రేషన్ బియ్యమే అని తేల్చి కేసులు నమోదు చేశారు. దీంతో మంత్రి ఆనం వర్సెస్ ఎమ్మెల్యే కోటంరెడ్డి రాజకీయ వైరంగా మారింది.

ఉరేసుకుని యువతి ఆత్మహత్యాయత్నం

- సీహెచ్‌సీలో వైద్యులు లేక పోయిన ప్రాణం

వెంకటాచలం: ఉరేసుకుని యువతి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం వెంకటాచలం క్లస్టర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రాత్రి 7.30 నుంచి 8.40 గంటల వరకు వైద్యులు రాకపోవడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందిందని చెప్పడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన మల్లి పూర్ణ (23)కు వచ్చే నెల 8వ తేదీన వివాహం జరగనుంది. అయితే ఏమైందో తెలియదు కానీ తన నివాసంలో ఉరేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడింది. వైద్యులు అందుబాటులో ఉండుంటే తమ బిడ్డ బతికి ఉండేదని పూర్ణ తండ్రి మల్లి శీనయ్య తన ఆవేదన వ్యక్తం చేశాడు. క్లస్టర్ ఆరోగ్య కేంద్రం వద్ద తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న పూర్ణ కుటుంబ సభ్యులను పోలీసులు అక్కడి నుంచి పంపేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వైద్య సేవలు అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్న వారిని తరిమేస్తున్న పోలీసులు

అనుమతిచ్చిన ఇసుక మాఫియా డాన్ ఎవరు

- పెరమన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరం
- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఇసుక తవ్వకాలకు ఆత్మకూరు నియోజకవర్గంలో అసలు ఏ అనుమతే లేదని, పెరుమాళ్లపాడులోని ఇసుక రీచ్ అనుమతి ఇచ్చిన ఇసుక మాఫియా డాన్ ఎవరని, రీచ్‌లోకి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ ఏ విధంగా అనుమతిచ్చారని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిలదీశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విక్రమ్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సంగం మండలం పెరమన సమీపంలో ఇటీవల అక్రమంగా అధిక టన్నేజీతో వెళ్తున్న ఇసుక టిప్పర్ ఢీకొనడంతో ఐదు కుటుంబాలకు చెందిన ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందడం విచారకరమన్నారు. ఆ రోజు అక్రమ ఇసుక తవ్వకాలు చేయకుండా ఉండి ఉంటే ఈ ప్రమాదమే జరిగేది కాదన్నారు. ఇసుక మాఫియా దుర్మార్గానికి ఐదు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరులో ఇసుక మాఫియా డాన్ వివిధ ఇసుక రీచ్‌ల ద్వారా రోజుకు 150 టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సంపాదిస్తున్నాడని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా వాహనాలను నడిపే డ్రైవర్లు మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి ఓ కారణమన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఎస్పీ ఆ ప్రాంతాన్ని పరిశీలించారని, నిందితుడు తమ అదుపులో ఉన్నట్లుగా తెలిపారని, ఈ ప్రమాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అయితే ఇంత వరకు తీసుకున్న చర్యలేమిటో తెలియడం లేదన్నారు. ఆ రోజు సాయంత్రమే నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సైతం తప్పులు నమోదు చేశారని, టిప్పర్ నంబరు కాకుండా కారు నంబరు వేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఏ-1గా డ్రైవర్, ఏ-2గా వాహన యజమాని, ఏ-3గా ఇసుక అక్రమ రవాణాదారుడు బుజ్జయ్యనాయుడు అని నమోదు చేశారని, అయితే తప్పు తెలుసుకున్న తర్వాత టిప్పర్ నంబరు పెట్టి ఎఫ్ఆర్ఐ నమోదు చేశారన్నారు. దీన్ని బట్టి పోలీసులపై ఎంతటి ఒత్తిడి ఉందో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మకూరు నియోజకవర్గంలో జరుగుతున్న మాఫియాలపై దృష్టి సారించితే మంచిదన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ప్రతి ఒక్కరికి రూ.50 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షలు వంతున ప్రకటించిందని, అయితే ఇప్పటి వరకు అది వారికి అందిందో లేదో కూడా తెలియలేదన్నారు. ప్రమాదం తర్వాత బాధ్యత వహించాల్సిన మంత్రి ఆ కుటుంబాలను ఆదుకోపోగా, /నాలుగు లేన్ల రోడ్డు మంజూరు చేయాలని కోరడం ఏమిటో అర్థం కాలేదని విక్రమ్‌రెడ్డి విమర్శించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ పూర్తిగా నిలుపుదల చేయాలని, బెల్ట్ షాపులన్నింటిని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, జోనల్ మహిళా అధ్యక్షురాలు మహిళ గౌరీ, ఆత్మకూరు జెడ్పీటీసీ లక్ష్మీప్రసన్న, జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, శ్రీనివాసనాయుడు, మండల కన్వీనర్లు శంకర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోర్టు సందర్శనేమైనా దేశ ద్రోహమా

- రామాయపట్నం పోర్టు పనులను వైఎస్సార్‌సీపీ నేతలు పరిశీలిస్తే తప్పేంటి
- పోర్టు నిర్మాణంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, అక్రమాలు బయటకు వస్తాయనే అడ్డగింత
- మా ప్రభుత్వం 15 నెలల్లోనే 51 శాతం పనులు పూర్తి చేస్తే, కూటమి 5 శాతం కూడా పూర్తి చేయలేదు
- జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి ప్రజలకు తెలియకూడదనే కుట్ర
- ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యే కమీషన్ల కక్కుర్తి వల్లే పోర్టు నిర్మాణం అటకెక్కింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన బుర్రా ఇతర నాయకులు

కందుకూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గోవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు సందర్శించడం ఏమైనా దేశద్రోహ చర్యా లేక ఉగ్రవాద కార్యకలాపాలా అంటూ మండిపడ్డారు. అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు బయట పడతాయనే ఉద్దేశంతోనే తమను అడ్డుకుంటున్నారని కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లాలో పోలీస్‌లు మితిమీరి ప్రవర్తిస్తున్నారన్నారు. ఇది సరైన విధానం కాదని, రేపు ప్రభుత్వం మారితే ఎవరూ కాపాడలేరని హెచ్చరించారు. రామాయపట్నం పోర్టు వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కందుకూరు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రామాయపట్నం పోర్టు సందర్శించేందుకు ముందుగానే పోర్టు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామని, అయితే కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో పోర్టు సందర్శనకు వెళ్లకుండా తమను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి బయట పడుతుందనో లేకపోతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుస్తుందనే భయంతో ప్రభుత్వ పెద్దలు తమను పోర్టు పరిసరాల్లోకి కూడా వెళ్లకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి దశలో రూ.4,924 కోట్ల వ్యయంతో పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వివరించారు. 2020లోనే పోర్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చి, 2022లో భూమిపూజ చేసి వెంటనే పనులు ప్రారంభించారని తెలిపారు. అనంతరం 794 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి 34 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 10 వేల మందికి ఉపాధి కల్పించేలా నాలుగు బెర్తుల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇందుకు రూ.985 కోట్లు ప్రభుత్వం తరఫున, రూ.3,938 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు కూడా మంజూరు చేశారన్నారు. ఇలా అన్ని అనుమతులతో పాటు భూమి, నిధులు సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం వల్ల జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే 51 శాతం పోర్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ఒక బెర్తు నిర్మాణం కూడా పూర్తి చేశారని, కస్టమ్స్ అనుమతులు రాకపోవడం వల్ల వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడంలో ఆలస్యమైందన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం నిర్వాకం వల్ల పోర్టు నిర్మాణం పూర్తిగా అటకెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కమీషన్ల కక్కుర్తితోనే పోర్టు పనుల నిలిపివేత

తమ ప్రభుత్వ హయాంలో 51 శాతం పోర్టు పనులు పూర్తి చేస్తే కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనా కాలంలో కనీసం 10 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయారని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టర్‌లను ఎవరిని తరిమేద్దాం, ఎవడు కమీషన్లు ఇస్తాడనే ఆలోచన చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ చేస్తున్నారని, దీనికి అనుగుణంగా తనకు ఎవరు డబ్బులిస్తే ఆ కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వాలనే స్థానిక ఎమ్మెల్యే కక్కుర్తి వల్ల పోర్టు నిర్మాణం అటకెక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉండే బడా నాయకులు ప్రజల అవసరాలు, ఉపాధి అవకాశాలు పక్కన పెట్టి తమకు కమీషన్లు వస్తే చాలు అన్న ధోరణి వల్లే 15 నెలలుగా పనులు నిలిపేశారని విమర్శించారు. డీల్ కుదిరిన తరువాత ప్రస్తుతం ఓ కంపెనీకి పనులు అప్పగించినా నేటికి 10 శాతం పనులు కూడా చేయని దుస్థితి ఉందన్నారు.

అభివృద్ధిని చూపించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

అసలు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించిన నాయకుడు ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారా అంటే అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కాకాణి వివరించారు. రూ.5,550 కోట్లతో 35 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మచిలీపట్నం పోర్టు, 23.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రూ.5 వేల కోట్ల ఖర్చుతో మూలపట్నం పోర్టు నిర్మాణం ప్రారంభించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. దాదాపు రూ.15 వేల కోట్ల ఖర్చుతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపట్నం పోర్టుల్లో 30 వేల మందికి ఉపాధి కల్పించేలా మారిటైమ్ బోర్డు ద్వారా నిధులు సమీకరించి పనులు ప్రారంభించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కానీ నేటి ప్రభుత్వం కాసులకు పోర్టులను అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు.

ఎమ్మెల్యే లంచాల వల్లే రైతులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కందుకూరు: స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇండోసోల్ కంపెనీ, పోర్టు నిర్మాణ కాంట్రాక్టర్ల నుంచి లంచాలు దండుకోవడం వల్లే భూములిచ్చిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కందుకూరు సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శించారు. రామాయపట్నం పోర్టు వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రామాయపట్నం పోర్టుతోపాటు, ఇండోసోల్ కంపెనీని తీసుకు వచ్చిందన్నారు. వీటికి అనుబంధంగా తెట్టు వద్ద ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కూడా ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని 51 శాతం పనులు పూర్తి చేస్తే, ఇండోసోల్ కంపెనీ పనులు ప్రారంభించిందన్నారు.

ఎమ్మెల్యే లాలూచీతో..

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇండోసోల్ కంపెనీ, పోర్టు కాంట్రాక్టర్లతో లాలూచీ పడి వారిచ్చిన లంచాలకు అలవాటు పడి రైతుల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూములిచ్చిన వారికి నాడు పోర్టులో ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరని ఉద్యోగాల నుంచి తొలగించి, ఎవరు డబ్బులు ఇస్తే వారికే ఎమ్మెల్యే ఉద్యోగాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములిచ్చిన రైతులు ఏమై పోవాలని ప్రశ్నించారు. భూసేకరణలోను అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల పేరిట రైతులను ఇబ్బందులు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

కరేడు భూములు కోల్పోతున్న రైతులకు ఇప్పటికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కోర్టులకు వెళ్లి అయినా ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆ వెంటనే పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభిస్తారని బుర్రా ధీమా వ్యక్తం చేశారు.

వరాలతల్లీ.. పాహిమాం

శరన్నవరాత్రి సంబరాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన జగన్మాతను భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో భవానీ అలంకరణ


అన్నపూర్ణాదేవిగా ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు


మూలాపేటలో భవానీ అలంకరణ


కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భవానీ అలంకరణ


జొన్నవాడలో త్రిపురాంబికాదేవిగా కామాక్షితాయి అమ్మవారు


రాపూరు: పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవి


మా ఇష్టం.. ఇలాగే అమ్ముతాం

- జీఎస్టీ తగ్గింపుతో మారిన మందుల ధరలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం పాత రేట్లకే విక్రయం
- కొన్ని మెడికల్ షాపుల్లోనూ అంతే

నెల్లూరు(అర్బన్): కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడే పలు రకాల మందులపై కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో ధరలు తగ్గాయి. కేన్సర్, గుండె, జన్యుపరమైన తీవ్రమైన వ్యాధులతో బాధపడేవారిని దృష్టిలో ఉంచుకుని గతంలో 5 శాతం జీఎస్టీ ఉన్న 36 రకాల ప్రాణాంతక మందులపై పూర్తిగా తొలగించింది. గతంలో 12 శాతం ఉన్న ఇతర 33 రకాల ఔషధాలను 0 శాతానికి మార్చింది. సాధారణ జబ్బులకు వినియోగించే మందులపై గతంలో 12 శాతంగా ఉన్న జీఎస్టీ ఇప్పుడు 5 శాతమైంది. కొన్నిరకాల మెడికేటెడ్ పేస్టులపై ఉన్న 18 శాతాన్ని కూడా 5 శాతంలోకి కేంద్రం తీసుకొచ్చింది. పలు రకాల వైద్య పరికరాలపై ఉన్న 18 శాతం నేడు 5 శాతమైంది. ఈ విధానం ఈనెల 22వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

ఉపయోగం కలిగేనా..

జిల్లాలో హోల్‌సేల్, రిటైల్ మెడికల్ షాపులు 1,850 వరకు ఉన్నాయి. జీఎస్టీ తగ్గడంతో మందుల స్ట్రిప్‌పై ఉండే ఎమ్మార్పీ కన్నా తక్కువకే అమ్మాలి. అయితే నెల్లూరులోని కార్పొరేట్, పేరున్న పెద్ద ఆస్పత్రుల్లో ఎమ్మార్పీకే అమ్ముతున్నాయి. దీంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో ఇదే పరిస్థితి ఉంది. నెల్లూరు నగరంలో పోటీ వల్ల గతం నుంచే ఎమ్మార్పీ కన్నా తక్కువకే (రిబేట్) ఇచ్చి స్వతంత్ర వ్యాపారులు మందులు అమ్ముతున్నారు. వీరిప్పుడు పాత పద్ధతిలోనే రిబేట్ ఇచ్చినప్పటికీ గతం కన్నా ప్రయోజనం చేకూరడం లేదు. తగ్గిన జీఎస్టీ ఫలాలు రోగులకు అందడం లేదు. అంతిమంగా వ్యాపారులే లాభ పడుతున్నారు. జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



మెడికల్ షాపు వద్ద పోస్టర్

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వం మందులపై జీఎస్టీ తగ్గించడంతో ఆ మేరకు ఎమ్మార్పీ కన్నా తగ్గించి రోగులకు అమ్మాలని మెడికల్ షాపుల యజమానులకు సూచించాం. ప్రతి షాపులో రేట్లు తగ్గినట్టు వాల్‌పోస్టర్లు కూడా ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నాం. తగ్గించిన జీఎస్టీ మేరకు కాకుండా అదనపు రేట్లకు అమ్మితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. రోగులు నేరుగా మాకు ఫిర్యాదు చేయొచ్చు.

– రమేష్‌రెడ్డి, ఏడీ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ

అధికార పార్టీ అండతో..

- ప్రార్థనా మందిరం ఆవరణలో బెల్టుషాపు ఏర్పాటుకు యత్నం
- అడ్డుకున్న గ్రామస్తులు
- మడమనూరులో ఉద్రిక్తత

మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామంలో ఓ ప్రార్థనా మందిరం ఆవరణలో అధికార పార్టీ నాయకుల అండతో కొందరు వ్యక్తులు మంగళవారం బెల్టుషాపు ఏర్పాటుకు ప్రయత్నించగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బీసీ భాస్కర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా మడమనూరులోని ప్రధాన రహదారి పక్కన ఇమ్మానుయేల్ ప్రార్థనా మందిరం ఉందన్నారు. ఆవరణలో పూల మొక్కలు, కానుగ, తాటిచెట్లతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణ ఉంటుందన్నారు. అయితే ఇటీవల దానిపై కన్నేసిన టీడీపీ నాయకులు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సాయంతో చెట్లను కొట్టేయడమే కాకుండా ఆ స్థలాన్ని ఆక్రమించుకుని బెల్టుషాపు పెట్టేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు బెల్టుషాపులను రద్దు చేస్తామని, మత ప్రార్థనా స్థలాలను కాపాడతామని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.


బెల్టు షాపు ఏర్పాటును అడ్డుకుంటున్న గ్రామస్తులు

హాస్పిటల్ సిబ్బందిపై హిజ్రాల దాడి

కందుకూరు: పట్టణంలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. మామూళ్లు ఇవ్వకపోతే అకారణంగా దాడులకు పాల్పడుతున్నారు. మంగళవారం కోవూరు రోడ్డులోని హరిణి హాస్పిటల్‌కు దసరా మామూళ్ల కోసం ముగ్గురు హిజ్రాలు వెళ్లారు. అక్కడ డబ్బులు వసూల్ చేసే విషయంలో రిసెప్షన్‌లో నర్సు, వాళ్లకు మధ్య వాదన జరిగింది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా హిజ్రాలు మహిళా నర్సుపై దాడికి దిగారు. అసభ్యంగా తిడుతూ, ఇష్టమొచ్చినట్లు దాడి చేసి కొట్టారు. అక్కడున్నవారు అడ్డుకునే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. దౌర్జన్యం చేసి నానా హంగామా సృష్టించి దాడులకు పాల్పడ్డారు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. హాస్పిటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానికంగా నివాసముంటున్న కొందరు హిజ్రాలు కొంతకాలంగా షాపుల వద్దకెళ్లి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని వారిపై దాడులకు పాల్పడుతూ అసభ్యకర చేష్టలకు పాల్పడుతున్నారు. దీనిపై అనేకమంది వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాటలు కలిపి.. గొలుసు దోచేసి..

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు దోచుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు చాకలి వీధిలో లక్ష్మమ్మ ఒంటరిగా నివాసముంటోంది. ఆమె తన పైపోర్షన్ ఖాళీగా ఉండటంతో టులెట్ బోర్డు పెట్టారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం ఓ వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి ఇంటి అద్దె విషయం మాట్లాడి పక్కరోజు వచ్చి అడ్వాన్స్ ఇస్తానని చెప్పాడు. మంగళవారం ఉదయం సదరు వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపాడు. ఒక్కసారిగా మెడలోని 12 గ్రాముల బంగారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు రూ. 200 అపరాధ రుసుముతో అక్టోబర్ 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు డీఈఓ బాలాజీరావు మంగళవారం తెలిపారు. రిజిస్ట్రేషన్‌ను ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు లేదా సచివాలయాల ద్వారా చేసుకోవాలన్నారు. వివరాలకు 89194 28319 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.128
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.230
స్కిన్‌లెస్ చికెన్	: రూ.256
లేయర్ చికెన్	: రూ.187



ఉదయగిరి సీహెచ్‌సీలో విచారణ

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీతారామపురం మండలం బసినేనిపల్లికి చెందిన మంజుల ప్రసవ సమయంలో పురిటిబిడ్డ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంగళవారం వైద్యులు సీహెచ్ కిరణ్, ఎం.బెట్టి జనాల్, ఆర్వీ హరిత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. డీసీహెచ్ఎస్ పరిమళ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, బాధిత కుటుంబంతో మాట్లాడామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


వైద్యులను విచారిస్తున్న బృంద సభ్యులు

ఎఫ్‌డీసీ చైర్మన్‌గా వివేక్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(అర్బన్): అటవీ శాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజినల్ చైర్మన్‌గా పి.వివేక్ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం పదిరోజుల క్రితం ఆయన్ను ఈ పదవిలో నియమించినా ఆలస్యంగా బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నెల్లూరు వేదాయపాళెంలోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో ఆయనకు కావలి, నెల్లూరు, నాయుడుపేట డివిజన్లకు చెందిన డివిజనల్ మేనేజర్లు, పలువురు రేంజర్లు కలిపి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివేక్ డీఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

పోలీస్ కస్టడీకి రౌడీషీటర్లు

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణా కేసులో ఒంగోలు జైలులో రిమాండ్‌లో ఉన్న రౌడీషీటర్లు చింతల భూపతి, అరవ సురేంద్ర, జగదీష్‌ను మూడురోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. మంగళవారం నెల్లూరు వేదాయపాళెం పోలీసులు ఒంగోలు జైలు నుంచి వారిని కస్టడీలోకి తీసుకున్నారు. నెల్లూరులోని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు వారిని విచారిస్తున్నారు. ప్రధానంగా అరుణ, శ్రీకాంత్‌తో ఉన్న సంబంధాలు?, వారితో కలిసి ఏవైనా నేరాలకు పాల్పడ్డారా?, గంజాయి దందా ఎప్పటి నుంచి చేస్తున్నారు?, ఎవరెవరు చేస్తున్నారు?, పెట్టుబడి ఎవరు పెట్టారు?, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని లేపేస్తే డబ్బే డబ్బు అంటూ సోషల్ మీడియాలో వైరలైన వీడియో విషయంలోవిచారించినట్లు తెలిసింది.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధిత అధికారులు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతుల శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. క్రమం తప్పకుండా కంటి, దంత వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయించాలని, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జునరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

నెల్లూరు(పొగతోట): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు మంచినీరు, అంగన్‌వాడీ భవనాలు, తదితర అవసరాలను గుర్తించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



సకల జీవకోటికి ప్రాణం.. ఆదిశక్తి అన్నపూర్ణ

నెల్లూరు(బృందావనం): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో శక్తిస్వరూపిణి అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకాలంకరణలో పూజిస్తుంటారు. వీటిల్లో ముఖ్యమైనది అన్నపూర్ణ దేవి అలంకరణ. సాక్షాత్తు తన ప్రాణనాథుడు పరమేశ్వరుడే ఒకానొక సమయంలో చిన్న ప్రణయవాదనలో పార్వతి అలిగి కైలాసం నుంచి కాశీ పట్టణం చేరి అన్నపూర్ణగా తన అక్షయపాత్రతో అందరి ఆకలి (క్షుద్బాధ) తీరుస్తుంటే అచ్చట కైలాసంలో పరమశివుడు ఆకలికి అలమటిస్తూ పార్వతీదేవిని వెతుక్కుంటూ పవిత్ర వారణాశికి రాగా అచ్చట అన్నపూర్ణగా నున్న పార్వతి వద్దకు తన భిక్ష పాత్రతో వెళ్లి 'భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ' అన్నట్లు పురాణాల వల్ల విదితమవుతోంది. అందువల్లే పవిత్ర పుణ్య క్షేత్రం కాశీలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరుడిగా యుగయుగాలుగా ప్రసిద్ధి చెంది లోకమునకు మాతాపితలుగా తమ బిడ్డలను కాపాడేందుకు కోట్ల మందికి మణికర్ణిక, హరిశ్చంద్ర ఘాట్‌లలో మృతిచెందిన వారికి ముక్తిని ప్రసాదిస్తూ విరాజిల్లుతున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి:	రూ.40
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.15